క్లుప్తంగా

మండపల్లి ఈవోగా 'నల్లం'



బాధ్యతలు చేపట్టిన సూర్యచక్రధరరావు

కొత్తపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం మందపల్లి శనైశ్చరస్వామి వారి దేవస్థానానికి నూతన సహాయ కమిషనర్, ఈవో (ఫుల్ అడిషనల్ చార్జ్)గా నల్లం సూర్య చక్రధరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన ఉప కమిషనర్, ఈవోగా వాడపల్లి దేవస్థానంలో ఉన్నారు. ఆయనను పలువురు అభినందించారు.

నేటి నుంచి అయ్యప్పలకు ఉచిత భిక్ష

కొత్తపేట: స్వామి అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులకు శుక్రవారం నుంచి మండలంలోని వాడపాలెం అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఉచిత భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఇన్‌చార్జ్ మట్టా బాబ్జి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా స్వామి అయ్యప్ప మండల దీక్ష చేపట్టిన భక్తులకు 41 రోజుల పాటు ఉచిత భిక్ష నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే ఈ ఏడాది చేపట్టే భక్తులకు శుక్రవారం నుంచి వచ్చే నెల 14 వ తేదీ ఇరుముడులు ధరించి శబరిమల వెళ్లే వరకూ భిక్ష ఏర్పాటు చేశామన్నారు. అయ్యప్ప మాలధారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాబ్జి కోరారు.

సబ్ రిజిస్ట్రార్‌గా జగన్మోహనరావు



అంబాజీపేట: అంబాజీపేట సబ్ రిజిస్ట్రార్‌గా యు.జగన్మోహనరావు నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నుంచి అంబాజీపేట గ్రేడ్‌–1 సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. ఇంతవరకు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన పి.శారద తాళ్లరేవుకు బదిలీ అయ్యారు. జగన్మోహనరావు మాట్లాడుతూ అందరి సహకారంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

7 నుంచి యథావిధిగా బస్సు పాసులు

రావులపాలెం: ఏపీఎస్ఆర్టీసీ బస్సు పాసుల వెబ్‌సైట్ ఈనెల 5 నుంచి 6 వరకూ ఆధునీకరణ జరుగుతుందని గురువారం డిపో మేనేజర్ తెలిపారు. అందువల్ల ఏ విధమైన పాసులు ఇవ్వలేమని మేనేజర్ కుమార్ తెలిపారు. 7వ తేదీ నుంచి యథావిధిగా కౌంటర్ల వద్ద అన్ని రకాలు పాసులు ఇస్తామని, విద్యార్థులు గమనించి సహకరించాలని డీఎం కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఎస్ఈ రాజాబాబు, రామచంద్రపురం ఈఈ రత్నాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం పినపళ్ల, పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల తదితర గ్రామాలకు సంబంధించి ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకూ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. వినియోగదారులందరూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మండపేట డీఈఈ శ్రీధర్, ట్రాన్స్‌కో ఏఈ డీఎంకే దుర్గాప్రసాద్, సబ్ ఇంజినీర్ వై.లక్ష్మి, లైన్ ఇన్‌స్పెక్టర్లు వాసంశెట్టి సత్యనారాయణ, కేవీవీ సుబ్రహ్మణ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. మండలంలోని గొలకోటివారిపాలెం, మోడేకుర్రు, వానపల్లి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దేవస్థానానికి సౌండ్ సిస్టం బహూకరణ



అంతర్వేది ఆలయంలో ఏసీ సత్యనారాయణకు సిస్టం అందజేస్తున్న పల్లవ సేన సంఘం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి గురువారం అంతర్వేది పల్లిపాలెం(పల్లవపాలెం)కు చెందిన కువైట్ అగ్నికుల క్షత్రియ యువ పల్లవ సేన సంఘం మైక్, సౌండ్ సిస్టం బహూకరించింది. ఈ మేరకు ఆలయంలో రూ.1.50 లక్షల విలువైన పై సిస్టంను ఆలయ ఏసీ వి.సత్యనారాయణకు వారు అందజేశారు. పల్లవ సేన సంఘ సభ్యులకు దేవస్థానం ప్రత్యేక దర్శనం కల్పించింది. తీర్థప్రసాదాలను సిబ్బంది అందజేశారు.



శైలపుత్రి అలంకారంలో పెదపట్నంలంక కనకదుర్గమ్మ



ఆత్రేయపురం కనకమహాలక్ష్మి అమ్మవారు



పెదపళ్లలో బాలాత్రిపుర సుందరిగా దుర్గాదేవి



బాలాత్రిపురసుందరిగా బి.సావరం కనకదుర్గాదేవి



తాటికాయలవారిపాలెంలో కనకదుర్గమ్మ వారు

వైభవంగా దేవీ నవరాత్రుల ప్రారంభం

- బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి

మామిడికుదురు: శ్రీదేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి శుభ ముహూర్తాన అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు ఘనంగా కలశ స్థాపన జరిగింది. ఈ ఆలయంలో అమ్మవారు మొదటి రోజు శైలపుత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మామిడికుదురు విజయ దుర్గమ్మను చామంతి పూలతో విశేషంగా అలంకరించారు. పాశర్లపూడిబాడవ ఆలయంలో శత చండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన మహోత్సవాలకు కలశ స్థాపన జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలోని ఆలయాల్లో గురువారం శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలు, మందిరాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. గ్రామాల్లో దేవీ ఆలయాల్లో భక్తులు, భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బాలాత్రిపుర సుందరీ రాజరాజేశ్వర, కనక మహాలక్ష్మి, మల్లమ్మ అమ్మవార్ల ఆలయాలతో పాటు ఆలయాల్లో పలు పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనాలతో సంగీత, నృత్య కార్యక్రమాలతో ఆలయాలు మందిరాల వద్ద శరన్నవరాత్రుల సందడి నెలకొంది. మండలంలోని ఉచ్చిలిలో వేంచేసిన విజయదుర్గాదేవి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.



తూర్పుపాలెంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం వైభవంగా దేవీ నవరాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు దుర్గాదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవి మండపాల్లో నెలకొల్పిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచారు. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. దేవీ మండపాలన్నీ విద్యుతీలంకరణతో దేదీప్యమానంగా వెలుగులు సంతరించుకున్నాయి. సంధిపూడి, పెదపళ్లలో నెలకొల్పిన విజయ దుర్గాదేవి అమ్మవారిని కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు.



అంతర్వేదిలో గుర్రాలక్క అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఏసీ సత్యనారాయణ

కొత్తపేట: స్థానిక బొరుసువారిసావరం విజయకనకదుర్గాదేవి ఆలయంలో ఆలయ పర్యవేక్షణలో అర్చకుడు బిక్కవోలు సత్యనారాయణాచార్యులు, వేదపండితులు ప్రత్యేకంగా అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వాడపాలెం జ్ఞాన సరస్వతీదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, చండీయాగ మహోత్సవాలు వైభవంగా ప్రారంభించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, ఏనుగులమహల్ రాజరాజేశ్వరీదేవి (శ్రీచక్రమహామేరు యంత్రం) ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు.

పి.గన్నవరం: దేవీ నవరాత్ర మహోత్సవాలు మండలంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే భక్తులు అమ్మవారి ఆలయాలకు వెళ్లి కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద తాటికాయల బాబ్జీ దంపతులు కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల విరాళాలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు. పి.గన్నవరంలోని లక్ష్మీకనకదుర్గమ్మ వారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవీనవరాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పాబోలు పల్లంరాజు గుప్తా దంపతుల ఆధ్వర్యంలో కలశస్థాపన జరిగింది. పోతవరం ప్రభల దిబ్బ వద్ద ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల పందిరిలో స్థానిక చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

మలికిపురం: మండలంలోని అన్ని గ్రామాల అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీలు ఏర్పాటు చేశారు. మలికిపురం మండలం తూర్పుపాలెంలో అమ్మవారి ఆలయంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పూజలు చేశారు. మండల పార్టీ అధ్యక్షులు అడబాల వీర బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

అశ్వరూఢాంబిక ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం పరిధిలోని అశ్వరూఢాంబిక (గుర్రాలక్క)అమ్మవారి ఆలయంలో గురువారం శరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. తొలుత అంతర్వేది దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణ అమ్మవారికి దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే తొలి పూజను అమ్మవారికి ఆయన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, సూపరింటెండెంట్ పి.విజయ సారథి, సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల అర్హత

రాజోలు: నేషనల్ స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన రాజోలుకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు క్రీడాకారులు వై.కార్తిక్, వై.గంగాభవాని, వై.శశిరేఖ, ఎ.హేమసత్యశ్రీ, జి.షారోమ్‌లను గురువారం పలువురు అభినందించారు. గత నెల 21 నుంచి 26వ తేదీ వరకు కాకినాడలో జరిగిన అండర్‌–14, 17, 19 విభాగాల్లో క్రీడాకారులు ప్రతిభ చూపారు. దీంతో ఈ నెల 4, 5 తేదీల్లో రైల్వేకోడూరులో జరిగే అండర్‌–19 పోటీలు, ఈ నెల 6, 7, 8 తేదీల్లో తిరుపతిలో జరిగే అండర్‌–14, అండర్‌–17 పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని కోచ్ ఆర్.మణికుమార్ తెలిపారు.

రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు మెర్లపాలెం విద్యార్థులు

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న చింతల అనూష రాష్ట్ర స్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబర్చింది. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వినుకొండలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున ప్రతిభ కనబర్చింది. అలాగే జిల్లా స్థాయి పోటీలకు ఆదే స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు హెచ్‌ఎం సీహెచ్ శ్రీహరి, పీఈటీ ఎస్ శ్రీకాంత్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పలువురు అభినందించారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీఈటీ శ్రీకాంత్



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు

అంతర్జాతీయ సదస్సుకు 'యర్రంశెట్టి'

మామిడికుదురు: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబిలో వచ్చే నెల 3 నుంచి 8 వరకు జరగనున్న నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్స్‌–నానో 17వ అంతర్జాతీయ సదస్సుకు రావాలని మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ విజయ్ సత్యప్రసాద్ యర్రంశెట్టికి ఆహ్వానం అందింది. ఆ దేశంలోని ప్రఖ్యాత ఖలీఫా సైన్స్ సాంకేతిక విశ్వ విద్యాలయం, నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్ అంతర్జాతీయ కమిటీ సంయుక్తంగా నిర్వహించనున్న సదస్సుకు హాజరు కావాలని నానో పదార్థాల శక్తి, ఫొటోస్, ఎలక్ట్రానిక్ అప్లికేషన్స్‌పై ప్రసంగించాలని సూచించారని విజయ్ గురువారం తెలిపారు. గతంలో సమర్పించిన నానో పదార్థాల పరిశోధన పత్రాన్ని విశ్లేషణ చేసి కమిటీ సభ్యులు తనకు ఈ అరుదైన అవకాశం కల్పించారన్నారు. విజయ్‌ను దీప్తి కళాశాల ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ, మోకా రంగారావు అదితరులు అభినందించారు.



విజయ్ సత్యప్రసాద్

ఓఎన్జీసీ అధికారులతో ఎమ్మెల్యే భేటీ

మలికిపురం: రాజోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ రాజమహేంద్రవరం ఓఎన్జీసీ కార్యాలయంలో అధికారులతో గురువారం సమావేశమయ్యారు. ఇప్పటివరకూ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాజోలు నియోజకవర్గానికి రూ.5 కోట్లు ఇచ్చినట్లు అధికారులు చెప్పారు. వాటర్ ప్రాజెక్టు మంజూరు చేయాలని కోరగా అధికారులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. చివరగా రాజోలు నియోజకవర్గంలోని గౌరవ సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులతో మీటింగ్ నిర్వహించడం కోసం వారం రోజుల్లో ఓఎన్జీసీ అధికారులను రాజోలు నియోజకవర్గానికి ఆహ్వానించారు. ఓఎన్జీసీ అధికారులతో పాటు రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు పాల్గొన్నారు.



ఓఎన్జీసీ అధికారులతో భేటీ అయిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అక్రమ లేఅవుట్లకు విద్యుత్ కనెక్షన్లపై ఆందోళన

మామిడికుదురు: పంచాయతీ అనుమతి లేని అక్రమ లే–అవుట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారంటూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాశర్లపూడి సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీపీ కుసుమ వనజ కుమారి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. లే–అవుట్లకు కనెక్షన్ల మంజూరులో విద్యుత్ శాఖాధికారుల తీరును సర్పంచ్ ప్రేమజ్యోతి తీవ్రంగా ఖండించారు. ఈ తరహా చర్యలు మంచిది కాదన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని ఎంపీటీసీ జంగమయ్య, వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. మండలంలో తొమ్మిది ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతులకు రూ.2.60 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ ఏఈ సురేష్ తెలిపారు. నాలుగు రోడ్ల అభివృద్ధికి రూ.3.80 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. మరో నాలుగురోడ్ల అభివృద్ధికి రూ.32.80 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఎంపీటీసీల ప్రమేయం లేకుండా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నారంటూ సభ్యులు వర్ధినేని రాము, నయినాల సీతామహాలక్ష్మి అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధుల మంజూరుపై ప్రశ్నించిన సర్పంచ్‌లను చులకన చేస్తూ ఏఓ మాట్లాడారని సర్పంచ్‌లు రమణకుమారి, తాతకాపు, సూర్యప్రకాశరావు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అడిగే హక్కు లేదా అని వారు ప్రశ్నించారు. అలాంటప్పుడు మేము సమావేశానికి ఎందుకు రావాలని నిలదీశారు. సర్పంచ్‌లను చులకన చేస్తూ తాను మాట్లాడలేదని ఏఓ వెంకటేశ్వరరావు వివరణ ఇచ్చారు. సమావేశంలో పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న నగరం సర్పంచ్ రమణకుమారి

సమసమాజ స్థాపనకు కృషి

మామిడికుదురు: రచయిత్రిగా డాక్టర్ బి.విజయ భారతి సమాజానికి ఎన్నో రచనలు చేశారని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు ప్రస్తుతించారు. విజయభారతి సంతాప సభ మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో గురువారం జరిగింది. విజయభారతి చిత్రపటానికి సంఘం ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, కుసుమ శ్రీధర్, సాధనాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలను కల్పించండి

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు కనీస సౌకర్యాలను కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కో కన్వీనర్ కె.వెంకట్ అన్నారు. ఆలమూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరిందన్నారు. దీనివల్ల విద్యార్థులకు ప్రాణహాని ఉన్నందున యాజమాన్యం సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సత్వరమే స్పందించి కళాశాల భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే కళాశాల మైదానం ఆక్రమణలకు గురికాకుండా సత్వరమే ప్రహరీ నిర్మించే విధంగా కళాశాల అభివృద్ధి కమిటీ చూడాలని ఆయన పేర్కొన్నారు.

బేతాళస్వామి కలశ స్థాపన



చెడీ తాలింఖానా చేస్తున్న యువకులు

అంబాజీపేట: విజయదశమి శరన్నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే విజయ బేతాళ స్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం వైభవంగా స్వామి వారి కలశ స్థాపన నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకటరామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జున మోహనరావు, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో మాచవరం దుర్గా క్షేత్రం రామ్‌ఘాట్ వద్ద నుంచి అఖండ దీపాన్ని ఏర్పాటు చేసి పురవీధుల గుండా ఊరేగించారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. ప్రదర్శనలో చెడీ తాలింఖానా, తీన్‌మార్ డాన్స్‌లతో భేతాళస్వామిని ఊరేగించి పెద్ద వీధిలోగల భేతాళ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించారు. అంబాజీపేట పశువుల మార్కెట్, కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

అంబాజీపేట: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు తీసుకున్న జక్కంశెట్టి సంధ్యను ఇసుకపూడి దాసరివారిపేట శ్రీ అభ్యుదయ యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షుడు పులపర్తి సురేష్ అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయురాలు సంధ్య, శ్రీధర్‌లను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సంధ్య విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోట విజయరాజు, ఎస్ఎంసీ చైర్మన్ నెల్లి ప్రసన్న, కత్తుల సత్యనారాయణ, నెల్లి వెంకటేష్, గంటా గిరి, నెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సంధ్య దంపతులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

టిక్కెట్ ధరలు తగ్గించాలి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో వివిధ పూజ టిక్కెట్ ధరలు విపరీతంగా పెంచారని ఆ టికెట్ల ధరలు సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అయినవిల్లిలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ సిబ్బందిని కలసి పూజ టిక్కెట్ ధరలు తగ్గించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు అడపా కోదండరామయ్య, కార్యదర్శి కె.రామకృష్ణ, బి.కృష్ణమూర్తి, భజరంగ్ దళ్ కార్యకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాతకాపుకు సన్మానం

మామిడికుదురు: స్వచ్ఛ భారత్ దివస్‌లో భాగంగా అమలాపురంలో జేసీ నిషాంతి చేతుల మీదుగా స్వచ్ఛతా హి సేవా సంకల్ప అవార్డు అందుకున్న పి.గన్నవరం నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపును గురువారం ఘనంగా సన్మానించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు జాలెం రమణకుమారి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు తాతకాపుకు పూల మాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

వరిలో సమగ్ర సస్యరక్షణపై అవగాహన

అయినవిల్లి: వరిలో చేపట్టాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు, మెళకువలపై ఆత్మ పీడీ ఏడీఏ రాజశేఖర్ రైతులకు అవగాహన కల్పించారు. గురువారం అయినవిల్లి మండలం మాగంలో 'పొలం–పిలుస్తోంది' కార్యక్రమంలో ఏవో వై.శోభ అధ్యక్షతన నిర్వహించారు. పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో అధిక రాబడి ఎలా సాధించాలో వివరించారు. రైతులకు ఎరువులు, పురుగుమందుల వినియోగం సమగ్ర సస్యరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో రైతుల నాయకులతో కలసి వరి చేలను పరిశీలించారు. కార్యక్రమానికి ఆత్మ ఏఓ మనోహర్, వ్యవసాయ సిబ్బంది, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పలువురు సర్పంచ్‌లకు స్వచ్ఛతా హి సేవా పరస్కారాలు

పి.గన్నవరం: పారిశుధ్య నిర్వహణలో బెల్లంపూడి గ్రామాన్ని ప్రథమ స్థానంలో నిలపడంతో పాటు, ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న బెల్లంపూడి సర్పంచ్ బండి మహాలక్ష్మికి జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ స్వచ్ఛతాహి సేవ అవార్డును అందజేశారు. గ్రామంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ, మౌలిక సదుపాయాల కల్పన వంటి సేవలు అందిస్తున్న సర్పంచ్ మహాలక్ష్మిని కలెక్టర్ అభినందించారు.



ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సర్పంచ్ మహాలక్ష్మి

అంబాజీపేట: మండలంలోని గంగలకుర్రు పంచాయతీ కార్యదర్శి, మాచవరం సర్పంచులకు స్వచ్ఛతాహీ సేవా అవార్డులు లభించాయి. మండలంలో కార్యదర్శి ఎస్.సత్యవేణి, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారిలకు ఈ అవార్డులు లభించినట్లు అధికారులు తెలిపారు.

ఆలమూరు: ప్రతిష్ఠాత్మకమైన స్వచ్ఛతా హీ సేవ అవార్డులకు మండలంలో ముగ్గురు ఎంపికయ్యారు. ప్రజా ప్రతినిధుల విభాగంలో సంధిపూడి సర్పంచ్ తోట భవాని ఎంపిక కాగా అధికారుల విభాగంలో పెదపళ్ల పంచాయతీ కార్యదర్శి వి.వేణి, పారిశుధ్య కార్మికుల విభాగంలో సీహెచ్ లాజరు ఎంపికైన వారిలో ఉన్నారు.

రాజోలు: పొదలాడ సర్పంచ్ కడలి సత్యనారాయణకు స్వచ్ఛతాహి సేవ అవార్డు వచ్చింది. దాంతో గురువారం పంచాయతీ కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు. సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి రజని, పంచాయతీ శానిటేషన్ సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందుకున్నారు.